


జంగారెడ్డిగూడెంలో మంత్రి వనిత పర్యటన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పట్టణంలో ఎంఎల్‌ఎ ఉన్నమట్ల ఎలిజా క్యాంపు కార్యాలయానికి బుధవారం విచ్చేశారు. ఈ సందర్భంగా త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలపై చర్చించారు. కామవరపుకోట మండలంలో జరిగే మహిళా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఆమె మార్గమధ్యలో ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయానికి వచ్చారు. ఆమె వెంట మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ రీజనల్ డైరెక్టర్ వందనపు సాయిబాబాలపద్మ ఉన్నారు.




ఎంఎల్‌ఎతో మాట్లాడుతున్న మంత్రి వనిత

ధాన్యం.. బెంగ..!

- రబీ ధాన్యం రైసుమిల్లులకు కేటాయింపుపై ఉత్కంఠ
- నిడమర్రు మండల రైతుల్లో ఆందోళన
- గణపవరం 'పశ్చిమ'లో కలవడంతో మిల్లుల సమస్యపై చర్చ
- జిల్లా యూనిట్‌గా మిల్లులు కేటాయిస్తే రైతులకు ఇబ్బందులు
- మండలంలో 50వేల మెట్రిక్‌టన్నుల దిగుబడి వచ్చే అవకాశం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రబీలో ధాన్యం విక్రయాలపై నిడమర్రు మండల రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ధాన్యం విక్రయాలకు సంబంధించి జిల్లా యూనిట్‌గా రైస్ మిల్లుల కేటాయింపులు చేస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో గడిచిన ఖరీఫ్‌లో నిడమర్రు మండలానికి సంబంధించిన ధాన్యం మొత్తం పక్కనే ఉన్న గణపవరం మండలంలోని నాలుగు మిల్లులకు కేటాయించారు. లారీలు అందుబాటులో లేకపోయినా రైతులు ట్రాక్టర్లలో తమ ధాన్యం మిల్లులకు తరలించారు. ఇది రైతులకు ఎంతగానో ఊరటకలిగించింది. అప్పట్లో గణపవరం మండలం ఏలూరు జిల్లాలోనే ఉండటంతో రైసుమిల్లల కేటాయింపులో ఇబ్బంది లేకుండా పోయింది. గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలో కలుపుతూ ప్రభుత్వం ఇటీవల గజిట్ విడుదల చేసింది. నిడమర్రు మండలం ఏలూరు జిల్లాలోనే ఉంది. నిడమర్రు మండలంలో రబీలో దాదాపు 11వేల ఎకరాల్లో వరిపంట సాగైంది. 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉంది. గణపవరం మండలం వేరే జిల్లాలో ఉందన్న కారణంతో నిడమర్రు మండల రైతులకు అక్కడ రైస్ మిల్లులు కేటాయించకపోతే తీవ్ర ఇబ్బందులు వచ్చే పరిస్థితి ఏర్పడనుంది. ఖరీఫ్‌లో లారీలు సక్రమంగా రాక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారం, పదిరోజులు లారీలకోసం రైతులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిడమర్రు మండలంలోని రైతులంతా దగ్గరలో గణపవరం మండంలోని రైసు మిల్లులకు ధాన్యం ట్రాక్టర్లపై రైతులు తరలించారు. రబీలో ధాన్యం విక్రయాలు కూడా గణపవరంలోని రైస్ మిల్లులను కేటాయించాలని నిడమర్రు మండలంలోని రైతులు కోరుతున్నారు. అలాకాకుండా దెందులూరు, ఏలూరు పరిసర ప్రాంతాల్లో మిల్లులకు కేటాయిస్తే తీవ్ర ఇబ్బందులు తప్పవన్న భయం రైతులను వెంటాడుతోంది. అదే జరిగితే లారీల్లో మాత్రమే ధాన్యం తరలించాల్సి వస్తోంది. ట్రాక్టర్లు వినియోగించడం కుదురదు. లారీల ఇబ్బందులను ఖరీఫ్‌లో రైతులు అనుభవించారు. దీంతో నిడమర్రు మండలంలోని ధాన్యం జిల్లాతో సంబంధం లేకుండా పక్కనే ఉన్న గణపవరం మండలంలోని రైసుమిల్లులకు కేటాయిస్తేనే రైతులకు ఇబ్బందులు లేకుండా ఉంటాయి. అలాకాకుండా జిల్లా యూనిట్ ప్రాతిపదికన దూర ప్రాంతాల్లోని రైస్ మిల్లులకు కేటాయిస్తే ధాన్యం విక్రయాల్లో రైతులకు ఇబ్బందులు తప్పవు. నూతన విధానంలో ఇప్పటికే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖరీఫ్‌లో తేమశాతం, తూకం, సంచులు వంటి సమస్యలతో రైతులు సతమతమయ్యారు. మిల్లర్లకు ఎదురు డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి సైతం నెలకొంది. దూరప్రాంత మిల్లులకు ధాన్యం విక్రయాలు కేటాయిస్తే రైతులకు మరింత భారంగా మారే పరిస్థితి ఏర్పడనుంది.



రబీ ధాన్యం కొనుగోలుపై పక్క ప్రణాళిక అవసరం

ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలులో ఏలూరు జిల్లాలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ధాన్యంతో రోడ్డెక్కి ఆందోళనలు చేసిన పరిస్థితి కొనసాగింది. రబీలో ధాన్యం కొనుగోలు సమస్యలు ఎదురుకాకుండా ఉండాలంటే పక్కా ప్రణాళికలు అవసరం. మిల్లుల కేటాయింపుల నుంచి తేమశాతం, తూకం నిర్ధారణ, సంచులు అందుబాటులో ఉంచడం వంటి అనేక సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. రబీ ధాన్యం కొనుగోలుకు సంబంధించి అధికారులు రూపొందించే ప్రణాళికలను బట్టి రైతులకు ఇబ్బందులు ఎదురుకాకుండా ఉంటాయి. రైసు మిల్లుల కేటాయింపుపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

మహిళలు అన్ని రంగాల్లో భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి - ఏలూరు

మహిళలు అన్ని రంగాల్లోని ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో 50 శాతానికి పైగా పనిలో భాగస్వాములైతే భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా రూపొందుతుందని జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు హాలులో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమాన్ని జ్యోతిని వెలిగించి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి విద్య ప్రధానమైందన్నారు. ప్రతి మహిళా విద్యావంతురాలై అన్ని రంగాల్లోనూ తన శక్తి సామర్థ్యాలు నిరూపించుకుని ఉన్నత శిఖరాలు అందుకోవాలని ఆకాంక్షించారు. దేశంలో ఉద్యోగ అవకాశాల్లో మహిళలు 50 శాతం పనిలో భాగస్వాములైతే ఇప్పటివరకు అభివృద్ధి చెందుతున్న దేశంగా ఉన్న మన భారతదేశం, అభివృద్ధి చెందిన దేశంగా రూపొందుతుందన్నారు. సమాజంలో మహిళల పట్ల లింగ వివక్ష నిర్మూలనకు కుటుంబ వ్యవస్థ నుంచే ప్రారంభం కావాలని, ఇందుకు తల్లితండ్రుల మైండ్ సెట్ మారాల్సి ఉందని చెప్పారు. మహిళా సాధికారతకు, మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి మాట్లాడుతూ సమాజంలో మహిళల పట్ల లింగ వివక్ష రూపుమాపితేనే మహిళాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఉద్యోగాల్లో కూడా మహిళలు తమదైన శైలిలో పనిచేసి మన్ననలు పొందాలన్నారు. ఎన్‌సిడి ప్రాజెక్టు జిల్లా అధికారి డాక్టర్ సిహెచ్.మానస మాట్లాడుతూ ఎన్‌సిడి ప్రాజెక్టు ద్వారా భేటీ బచావో...భేటీ పడావో నినాదందో బడి ఈడు బాలికలు తప్పనిసరిగా బడిలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళల అభ్యున్నతికి ప్రతిఒక్కరూ చేయూత ఇవ్వాలన్నారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలంటే విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఒత్తిడి లేని విద్య అందించాలన్నారు. తల్లితండ్రులు ఇంట్లో పిల్లలతో స్నేహపూర్వక వాతావరణం కలిగి ఉండేలా చూడాలని, పాఠశాలల్లో చెప్పిన విద్యపై ప్రతిరోజు తల్లితండ్రులు ఇంట్లో పిల్లలతో చర్చించాలన్నారు. చిన్న పిల్లలు ఇంట్లో మొబైల్‌కు దూరంగా ఉండేలా తల్లితండ్రులు చూడాలన్నారు. కుటుంబంలో బాలికల పట్ల లింగ వివక్ష లేకుండా చూడాల్సిన బాధ్యత తల్లితండ్రులపై ఉందన్నారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి, ఎన్‌సిడి ప్రాజెక్ట్ జిల్లా అధికారి డాక్టర్ సిహెచ్.మానస, జిల్లా వెనుకబడిన సంక్షేమ అధికారి నాగరాణి, పోలవరం డిఎస్‌పి లతాకుమారి, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ రంగాల్లో సేవలందించిన మహిళలను దుశ్శాలువా, పూలమాల, మెమెంటోలతో జిల్లా కలెక్టర్ సత్కరించారు. అనంతరం ఇటీవల మహిళా ఉద్యోగినులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను జిల్లా కలెక్టర్ అందించారు. ఈ సందర్భంగా సభికులతో భేటీ బచావో.. భేటీ పడావో బాలికా సంక్షేమానికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎవిఎన్ఎస్.మూర్తి, జిల్లా పరిషత్ సిఇఒ కె.రవికుమార్, ఎన్‌జిఒ నాయకులు పాల్గొన్నారు.

సమాజ ప్రగతిలో మహిళల పాత్ర ప్రశంసనీయం

సమాజ ప్రగతిలో మహిళల పాత్ర అత్యంత ప్రశంసనీయమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి తెలిపారు. బుధవారం ఏలూరు నగర పాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో ఏలూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం మహిళ పొదుపు సంఘాల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజేశ్వరి మాట్లాడుతూ సమాజ ప్రగతిలో మహిళల పాత్ర కీలకమని తెలిపారు. ఎన్‌సిడి జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్.మానస మాట్లాడుతూ ఆడపిల్లలు చదువు ద్వారా వారు అభివృద్ధి చెందడమే కాకుండా సమాజాభివృద్ధికి దోహదపడొచ్చన్నారు. అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి, ఎన్‌సిడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మానసను పొదుపు సంఘ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.ఇమాన్యుల్ నగరపాలక సంస్థ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, మెప్మా ఎఒ బి.రజినీకాంత్, డిఇలు బి.జాన్సీరాణి, కె.సుధాకర్, డిఎంసి సిహెచ్.మహాలక్ష్మి, పి.నాగమణి, సిఒలు, ఆర్‌పిలు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ'లో అవకతవకలపై చర్యలు తీసుకోవాలి : వ్యకాస

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉపాధి హామీ చట్టంలో అవకతవకలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని వెల్లమెల్లి గ్రామంలో ఇంటింటికీ తిరిగి ఉపాధి కూలీలు పడుతున్న ఇబ్బందులను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్న ఆంజయ్య అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు గత రెండు నెలల నుండి వేతనాలు అందక నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలు, వ్యవసాయ కూలీలు వ్యవసాయ పనుల్లేక ఉపాధి కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు నిధులు తగ్గించడంతో పాటు పనుల్లో చేర్పులు చేస్తున్నారని విమర్శించారు.

మహిళలు, పేదలు, వ్యవసాయ కూలీలు అందరికీ ఆసరాగా ఉన్న ఈ చట్టం ద్వారా అడిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాల్సిన అధికారులు తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. గ్రామంలో పేదలు గత రెండు వారాల నుంచి పనులు కావాలని అడుగుతుంటే ఫీల్డ్ అసిస్టెంట్లు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులే చట్టాన్ని ధిక్కరిస్తున్నారని విమర్శించారు. ఉపాధి హామీ చట్టం రాజ్యాంగ బద్ధంగా ఏర్పడిందని దీన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. పేదలందరికీ ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎవరైతే అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారో వాళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ప్రసాద్, అశోక్, వెంకటేశ్వరరావు, ఏసు పాల్గొన్నారు.

5న చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - దెందులూరు

కార్మికుల, రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చేనెల ఐదో తేదీన చేపడుతున్న చలో ఢిల్లీని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు పిలుపునిచ్చారు. మండలంలోని కొవ్వలి యాదవ్‌నగర్‌లోని ఆంజనేయ స్వామి గుడి ఆవరణలో సిఐటియు, ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘాల మండల కమిటీల ఆధ్వర్యంలో కార్మిక, కర్షక మండల ఐక్య సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సదస్సుకు ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి సున్నా వెంకట్రావు, సిఐటియు మండల కార్యదర్శి కామేశ్వరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలు ఫలితంగా కార్మికులు, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులు పోరాడు సాధించుకున్న కార్మిక చట్టాలను తుంగలో తొక్కి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చారని చెప్పారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు ఉత్పత్తి ఖర్చులకు ఆధారంగా 50 శాతం కలిపి మద్దతు ధర ప్రకటించాలని కోరారు. ఈ ధరలు అమలకు మద్దతు ధరల గ్యారంటీ చట్టం తేవాలన్నారు. కౌలు రైతులకు సమగ్ర కౌలు చట్టం తీసుకువచ్చి గుర్తింపు కార్డులు ఇచ్చి పంట రుణాలు, నష్టపరిహారాలు, బీమ పరిహారాలు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పిఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కౌలు రైతులకు వర్తింపజేయాలన్నారు. ఈ సదస్సులో కట్టా సత్యనారాయణ, చిన్నారావు, రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్.లింగరాజు

సుఖ సంతోషాలకు ప్రతీక హోలీ

ప్రజాశక్తి - టి.నరసాపురం

మానవ జీవితంలో సుఖ సంతోషాలకు ప్రతీకగా జరపుకొనే పండుగ హోలీ అని విజన్ యుపి స్కూల్ కరస్పాండెంట్ పురం శ్రీనివాస్ అన్నారు. స్థానిక విజన్ యుపి స్కూల్‌లో కరస్పాండెంట్ పురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో హోలీ పండుగ సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో అన్ని సమాజాలను కలిపి కుల, మత, వర్గ భేదాలు లేకుండా ఇంద్రధనస్సుగా ఏకం చేసే పండుగే హోలీ అన్నారు. హోళిక అనే రాక్షసి చనిపోయిన సందర్భంగా ప్రజలంతా ఆనందంతో రంగులు పూసుకుంటూ హోలీ పండుగను జరుపుకున్నారని తెలిపారు. మానవ జీవితంలో కష్టాలన్నీ పోయి సుఖసంతోషాలతో రంగులమయం కావాలని ఉత్సాహంతో రంగులు పూసుకుంటారని తెలిపారు. కొన్నిచోట్ల వసంత ఋతువుకు ఆరంభ సూచికగా ఈ పండుగను జరుపుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, వరలక్ష్మి, మహాలక్ష్మి, అరుణ, పుష్పావతి, ఎస్తేరు రాణి పాల్గొన్నారు.



టి.నరసాపురంలో హోలీ సంబరాల్లో విద్యార్థులు

పోలవరం : హోలీ పర్వదినాన్ని మండలంలోని యువత బుధవారం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు హోలీ వేడుకలను పురస్కరించుకుని రంగురంగుల నీళ్లు ఒకరిపై ఒకరు చల్లుకున్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి : ఐద్వా

ప్రజాశక్తి - ఏలూరు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐద్వా ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. ఏలూరు వన్‌టౌన్ వంకాయగూడెం సెంటర్ స్థానిక రామాలయం వద్ద ఈ ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకులు కల్యాణి మాట్లాడుతూ బుధవారం మహిళా దినోత్సవం సందర్భంగా ఐద్వా ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఈ ఆటల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పోటీల్లో స్థానిక మహిళలు, పిల్లలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం ప్రభుత్వాలు వేడుకలు జరుపుతున్నారని కాని, వాస్తవానికి మనదేశంలో రోజురోజుకీ మహిళలపై అత్యాచారాలు దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. శ్రామిక మహిళలకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. ఈ సమాసంలో ఐద్వా నాయకులు ఉషారాణి, భారతి, కమల కుమారి, రోహిణి, పావని, నాగదేవి, అమ్మాజీ, చిన్నారి, పుణ్యవతి, లీలావతి పాల్గొన్నారు.

డిఎ బకాయిలు చెల్లించాలి : ఎంఎల్‌సి సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు సంబంధించిన రూ.వేల కోట్ల బకాయి పడి, మంత్రి వర్గ ఉప సంఘం ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి, వారు దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్ సొమ్ముల నుంచి, ఎపిజిఎల్‌ఐ సొమ్ముల నుంచి మంజూరైన రుణాలు, ఫైనల్ పేమెంట్లు, పెండింగ్ గ్రాడ్యుటి సొమ్ములు రూ.మూడు వేల కోట్లు మాత్రమే మార్చి నెలాఖరికి చెల్లించేందుకు అంగీకరించారని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అన్నారు. 2018 జులై ఒకటో తేదీ నుంచి 2020 డిసెంబర్ 31 వరకు చెల్లించాల్సిన 30 నెలల బకాయిలు రూ.రెండు వేల కోట్లు, 2019 జనవరి ఒకటో తేదీ నుంచి 2021 జూన్ 30 వరకు చెల్లించాల్సిన డిఎ బకాయిలు రూ.రెండు వేల కోట్లు, సరెండర్ లీవ్ బకాయిలు రూ.వెయ్యి కోట్లు మొత్తం రూ.ఐదు వేల కోట్లు చెల్లించడానికి మళ్లీ గడువులు పెట్టి వాయిదా వేయడం ఉద్యోగులను మోసగించడమేనన్నారు. 2021 జనవరిలో జిఒ జారీ చేసి మూడు వాయిదాల్లో చెల్లిస్తామని రెండేళ్లు గడిచినప్పటికీ బకాయిలు చెల్లించకుండా జాప్యం చేయడం వల్ల ఉద్యోగులకు వడ్డీ రూపంలో రావాల్సిన రూ.400 కోట్ల వడ్డీ నష్టపోయారన్నారు. ఈ బకాయిలు చెల్లింపునకు మళ్లీ సెప్టెంబర్ దాకా గడువు పెట్టడం శోచనీయమన్నారు. ప్రభుత్వం జిఒ జారీ చేసిన నాటి నుంచి డిఎ బకాయిలు, పిఎఫ్ వడ్డీ రేటు ప్రకారం వడ్డీతో సహా వెంటనే చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు.



అక్కమ్మ కోనేరు

అక్కమ్మ కోనేరు అభివృద్ధికి చర్యలు

కేంద్ర అమృత్ పథకంలో రూ.1.25 కోట్లు మంజూరు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణ పురపాలక సంఘ నూతన కార్యాలయం సమీపంలో ఉన్న అక్కమ్మ కోనేరు రూపురేఖలు మారనున్నాయి. అక్కమ్మ కోనేరును పార్కుగా అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకంలో భాగంగా రూ.1.25 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు మురుగునీరు నిల్వతో అక్కమ్మ కోనేరు ప్రాంతం అపరిశుభ్రంగా దర్శనమిస్తుంది. కాని కోనేరు గట్టును పటిష్టపరచి వాకింగ్ ట్రాక్, పార్కు, బోటు షికారు సౌకర్యాలు కల్పిస్తే ఆహ్లాద పర్యాటకంగా అక్కమ్మ కోనేరు రూపొందనుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నేటి వరకు అక్కమ్మకోనేరు అభివృద్ధి పనులకు టెండర్లు ఖరారు కాలేదు. 2022-23 ఆర్థిక సంవత్సరం ముగింపునకు రానున్న నేపథ్యంలో నేటి పాలకవర్గ సభ్యులు అక్కమ్మ కోనేరు అభివృద్ధిపై దృష్టి సారించి త్వరితగతిన పనులు చేపట్టేవిదంగా కృషి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్‌ని వివరణ అడుగగా అక్కమ్మ కోనేరు అభివృద్ధికి రూ.1.25 కోట్లు కేంద్రప్రభుత్వ నిధులు మంజూరైనట్లు తెలిపారు. ప్రస్తుతం ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందువల్ల ఏ చర్యలు చేపట్టడం లేదని తెలిపారు. త్వరలో అక్కమ్మ కోనేరు అభివృద్ధి కోసం టెండర్ల ప్రక్రియపై దృష్టి సారిస్తామని తెలిపారు. 2022-2023 ఆర్థిక సంవత్సరం ముగిసినప్పటికీ నిధులు వినియోగించే అవకాశం ఉంటుందని తెలిపారు.

పట్టణ ప్రజలకు కానుకగా అందిస్తాం

మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి



పట్టణంలో అక్కమ్మ కోనేరును ఆహ్లాదకరమైన పార్కుగా అభివృద్ధి పరచి ప్రజలకు కానుకగా అందిస్తామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి తెలిపారు. పాలకవర్గ సభ్యుల సమన్వయంతో నిధులు సక్రమంగా వినియోగించేలా చర్యలు చేపడతామని చెప్పారు. పట్టణ మధ్యస్థంగా ఉన్న అక్కమ్మ కోనేరులో బోటు షికారు, వాకింగ్‌ట్రాక్, పార్కు సౌకర్యాలు ఏర్పాటు ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం సమకూరేవిధంగా కార్యచరణ చేస్తామని తెలిపారు.


అసైన్‌మెంట్‌లో చేర్చేందుకు అడ్డదారులు..!

- కొండలు, వాగులు, చెరువుల భూముల కబ్జాకు అక్రమార్కుల యత్నం


ప్రజాశక్తి - నూజివీడు

త్వరలో చేపట్టబోయే ఆసైన్‌మెంట్ కమిటీలో పోరంబోకు భూములను చేర్చేందుకు నిబంధనలను తుంగలోకి తొక్కి భూములను దక్కించుకోవడానికి కొందరు అక్రమార్కులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. కొండలు, అడవి, వాగు, చెరువు పోరంబోకు భూములను రాత్రికి రాత్రే సాగు భూములుగా చదునుచేసి అడ్డదారిలో డీ ఫారం పట్టా పొందేందుకు పలువురు అనేక అడ్డదారులు తొక్కుతున్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు భూముల ఆక్రమణకు రెవెన్యూ, అటవీ, ఇరిగేషన్ అధికారులు, ఆయా శాఖల సిబ్బంది అన్నివిధాలా సహకరిస్తున్నట్లు సమాచారం. నూజివీడు నియోజకవర్గంలోని నూజివీడు, ముసునూరు, చాట్రాయి, అగిరిపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో ఇలాంటి ఘటనలు ఇటీవల వరుసగా వెలుగుచూస్తున్నాయి. దౌర్జన్యం చేసి లాక్కునే వాడిదే భూమి అన్నట్లు అసైన్‌మెంట్ కమిటీలో తమ పేరు మీదనో, తమ కుటుంబ సభ్యుల పేరు మీదనో భూములు దక్కించుకోనేందుకు కొంతమంది ప్రయత్నాలు చేస్తున్నారు. గయాళ (డబ్ల్యుడి) భూములకు మాత్రమే అసైన్ కమిటీలో చోటు కల్పించాలి. అది కూడా ఏడాదిన్నర నుండి రైతుల సాగులో ఆ భూమి ఉండాలనే నియమనిబంధనలు సైతం తుంగలో తొక్కుతున్నారు. దున్నేవాడిదే భూమి అనే సిద్ధాంతాలకు తిలోదకాలిచ్చి దౌర్జన్యం చేసే వాడిదే భూమి అనే రీతిలో ప్రభుత్వ భూములను చేజిక్కించుకోవడానికి దుష్ట ప్రయత్నాలు చేస్తున్నారు. ఆక్రమణదారుల వ్యూహాలు అమలు పరిచే పనిలో అధికారులు తలమూనకలు కావడంతో ఈ విషయమై గ్రామాల్లో తీవ్రఅలజడి రేగుతుంది. కొండ పోరంబోకు, అడవి, చెరువు వాగు పోరంబోకు భూముల స్వరూపాన్ని సైతం మార్చి గయాళ భూములుగా రికార్డుల్లో మార్చే పనిలో రెవెన్యూ శాఖ అధికారులు నిమగ్నమైనట్లు తెలుస్తుంది. ఇప్పటికిప్పుడు సాగుకు పనికి వచ్చే విధంగా చదును చేసిన భూములను కూడా పరిగణలోకి తీసుకొని అసైన్ కమిటీలో చేర్చుతూ రెవున్యూ శాఖ వారు అవకతవకలకు తెరలేపినట్లు ప్రచారం కొనసాగుతుంది.

పాతరావిచర్ల పరిధిలోని శోభనాపురం రోడ్డులోని నల్లగట్టు, బోగందానిగట్టు అని పిలవబడే రెండు కొండలను కొల్లగొట్టే పనులు ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతున్నాయి. రెండు గట్ల మీద 20 ఎకరాల వరకూ కొండపై చదును చేసే పనులను ప్రస్తుతం ఆగమేఘాల మీద చేపడుతున్నారు. గట్లను చదును చేసి భూములను అసైన్ కమిటీలో పొందుపరచి పట్టాలు పొందేందుకు పావులు కదుపుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. కొంతమంది నాయకుల ప్రోద్బలంతో కొండలను కొల్లగొట్టే పనులను యుద్ధ ప్రాతిపదికన చేపతున్నట్లు గ్రామస్తులు చెబతున్నారు. దీనికి ఎంఎల్‌ఎ కార్యాలయం నుండి సైతం అన్ని విధాలా మద్దతు ఉందనే ప్రచారం కొనసాగుతుంది. అయితే పాత రావిచర్లలో కొండలను కొల్లగొట్టే పనులను జనసేన నాయకులు స్పందనలో ఫిర్యాదు చేయడంతో బ్రేక్ పడినట్లు తెలిసింది. అలాగే ముసునూరు మండలం కాట్రేనిపాడు, లోపూడి తదితర గ్రామాల్లో, చాట్రాయి మండలంలోని జగన్నాథపురంలో అడవి భూములు అధికసంఖ్యలో అక్రమ సాగులో ఉన్నాయి. ఆ భూములను కూడా పోర్టింగ్ సర్వే నంబర్లతో అసైన్ కమిటీలో చోటు కల్పించి పట్టాలు పొందే పనులు ముమ్మరమైనట్లు సమాచారం. గతంలో అసైన్ కమిటీ అసెంబ్లీ నియోజకవర్గం వారీగా జరిగేది. కాగా ప్రస్తుతం జిల్లా వారీగా అసైన్ కమిటీ జరుగుతుందని నూజివీడు తహశీల్దార్ తెలిపారు. అసైన్ కమిటీ ఎప్పుడు జరుగుతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. అధికార పార్టీ నాయకులకు తప్పా అసైన్ కమిటీ విషయం ఎవరికీ తెలియని విధంగా అత్యంత గోప్యంగా ఈ తతంగం అంతా కొనసాగుతుంది. 2013 సంవత్సరం తర్వాత అసైన్ కమిటీ జరగలేదు. అఖిలపక్షాలు లేకుండా అధికార పక్షం మాత్రమే ఉండే విధంగా త్వరలో జరగబోయే అసైన్ కమిటీ జరగనుందనే ప్రచారం జరుగుతుంది. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ప్రస్తుత అసైన్ కమిటీ సమావేశంలో కొండ, అటవి, చెరువు, వాగు పోరంబోకు భూములను గయాళ భూములుగా మార్చి అసైన్ కమిటీలో పెట్టే క్రమంలో రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు భారీగా అవినీతికి పాల్పడుతున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అసైన్ కమిటీలో వందలాది ఎకరాలు పొందు పరిచే అవకాశం ఉండటంతో ఎకరాకు రూ.15 వేల నుండి రూ.20 వేల వరకు ఆయా భూములకు సంబంధించిన వారి వద్ద నుండి రెవెన్యూ సిబ్బంది వసూలు చేస్తున్నట్లు తెలిసింది. తహశీల్దార్‌కు ఇవ్వాలని ఈ వసూళ్ల పర్వం కొనసాగుతున్నట్లు సమాచారం. ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి అక్రమాలకు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నూజివీడు మండలం రావిచర్లలోని డి.ఫారం భూమి



ముసునూరు మండలం కాట్రేనిపాడులోని డి.ఫారం భూమి

ఇంత వరకూ అసైన్ కమిటీలో ఏ భూములూ చేర్చలేదు : తహశీల్దార్ ఎల్లారావు

అసైన్ కమిటీలో చేర్చడానికి అభ్యంతరాలు గల భూముల స్వరూపం మార్చడానికి కలెక్టర్ అనుమతి ఉండాలి . అసైన్ కమిటీలో ఇప్పటి వరకూ ఏ భూములనూ చేర్చలేదు. అయితే అసైన్ కమిటీలో చేర్చడానికి మండలంలోని ముక్కొల్లుపాడు, రావిచర్ల, దిగవల్లి, బత్తులవారిగూడెం, యనమదలలో 216 ఎకరాలను గుర్తించాము. గ్రామసభలు ఏర్పాటు చేసి అభ్యంతరాలను స్వీకరించిన తర్వాత అభ్యంతరం లేని భూములను మాత్రమే అసైన్ కమిటీలో చేర్చుతాం.


అగ్ని ప్రమాద బాధితులకు చేయూత

ప్రజాశక్తి - వేలేరుపాడు

మండలంలోని కన్నాయిగుట్ట గ్రామంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదం వల్ల ఇళ్లు పూర్తిగా కాలిపోయి సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులైన 27 కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని టిడిపి పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాలను టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి బుధవారం ఆయన పరామర్శించి అధైర్య పడవద్దని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన బాధిత కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ.25 కేజీల బియ్యం, రూ.ఐదు వేల ఆర్థిక సాయం, దుప్పట్లు పంపిణీ చేశారు. టేకూరు గ్రామంలో కొన్నిరోజుల క్రితం సంభవించిన అగ్నిప్రమాదంలో మూడు ఇళ్లు దగ్ధమై నిరాశ్రయులైన వారిని పరామర్శించి మూడు కుటుంబాలకు 25 కేజీల బియ్యం, రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందించారు. అదే గ్రామంలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన రాంబాబు కుటుంబానికి రూ.ఐదు వేల ఆర్థిక సహాయం అందించారు.

సిపిఐ పరామర్శ

వేలేరుపాడు : కన్నాయగుట్ట గ్రామంలో అగ్ని ప్రమాదం వల్ల నష్టపోయిన బాధిత కుటుంబాలకు సిపిఐ ఆధ్వర్యంలో బుధవారం సహాయం అందించారు. బాధితులను సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి కొండేటి బేబీ పరామర్శించారు. 27 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.రెండు వేలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, మండల కార్యదర్శి బాడిస రాము, ఎఐటియుసి మండల కార్యదర్శి కారం దారయ్య, శాఖ కార్యదర్శి కారం బొజ్జి, మహిళా సమాఖ్య నాయకులు సోడె రమాదేవి, కరటం సీతామహాలక్ష్మి, పిట్ట జయ, బాడిస అనంతలక్ష్మి పాల్గొన్నారు.



ఆకుమర్తి రామారావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న టిడిపి నేతలు

ఘనంగా రామారావు పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రముఖ సామాజికవేత్త, టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుమర్తి రామారావు పుట్టినరోజు వేడుకలు పట్టణ క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. అకుమర్తి రామారావు పుట్టినరోజు వేడుక సందర్భంగా ఆయనకు పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. నారలోకేష్ సేవా సంస్థ ఏర్పాటుతో అనేకమందికి సాయం అందించిన అకుమర్తి రామారావు సామాజిక సేవతో పాటు రాజకీయంగా సుపరిచితులయ్యారు. చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్‌ఎ టికెట్ ఆశిస్తున్న వారిలో ఆకుమర్తి ముందువరుసలో ఉన్నారు. ఈ నేపథ్యంలో అకుమర్తి రామారావు పుట్టినరోజు వేడుకలకు టిడిపిలో పలువురు ప్రముఖులు పాల్గొని పుష్పగుచ్ఛాలు అందించి శుభాకంక్షలు తెలియచేయడంతో మరింత చర్చనీయాంశమైంది. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు, జంగారెడ్డిగూడెం పట్టణ సీనియర్ నాయకులు పరిమి సత్తిపండు, మున్సిపల్ కౌన్సిలర్ కరటూర రమాదేవి, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పగడం సౌభాగ్యవతి, పెనుమర్తి రాంకుమార్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి బొబ్బర రాజ్‌పాల్‌కుమార్, ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వలసపల్లిలో 'రాత్రిసభ'

ప్రజాశక్తి - ముసునూరు

కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో వారానికి ఒక గ్రామంలో రాత్రి సభ నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జి.రాణి, తహశీల్దార్ దాసరి సుధ తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి మండలంలోని వలసపల్లి గ్రామంలో సచివాలయం వద్ద సర్పంచి చలసాని దామోదరరావు, మండల శాఖ అధికారుల ఆధ్వర్యంలో రాత్రిసభ నిర్వహించారు. గ్రామస్తుల పలు సమస్యలను పరిష్కరించారు.

నేడు జయమంగళ నామినేషన్

ప్రజాశక్తి - కైకలూరు

మాజీ ఎంఎల్‌ఎజయమంగళ వెంకటరమణ గురువారం ఎంఎల్‌సిగా నామినేషన్ వేస్తున్నట్లు తెలిపారు. ఉదయం ఆరు గంటలకు మండలంలోని ఆటపాకలోని ఆయన నివాసం నుంచి తాడేపల్లిలోని సిఎం జగన్మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ జరుగుతుందన్నారు. అనంతరం సచివాలయంలో ఎంఎల్‌సి అభ్యర్థిగా నామినేషన్ వేస్తారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు, స్నేహితులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

అన్నాక్యాంటీన్ ప్రారంభం

ప్రజాశక్తి - చింతలపూడి

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అన్న క్యాంటీన్‌ను నారా లోకేష్ యువజన ఫౌండేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లి శ్రీను, జిల్లా అధ్యక్షులు చలసాని శ్రీశైలం, గుడివాడ జిల్లా అధ్యక్షులు చెరుకూరి హరికృష్ణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్లి శ్రీను, ఐటిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడా అనీష్‌కుమార్, నాయకులు మారుమూడి థామస్ మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో అక్షయపాత్ర ద్వారా అన్నా క్యాంటీన్‌ను ఏర్పాటు చేసి ఎంతో మందికి కడుపు నింపేవారన్నారు. వైసిపి ప్రభుత్వంలో అన్నా క్యాంటీన్‌ని రద్దు చేశారన్నారు. రానున్న రోజుల్లో మళ్లీ చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడ్డాక తిరిగి రాష్ట్ర వ్యాప్తంగా అన్నా క్యాంటీన్‌లను పున:ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి బోడా నాగభూషణం ప్రభుత్వ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పేషెంట్లకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నియోజకవర్గ అధ్యక్షులు కెటిఆర్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బొబ్బర రాజ్‌పాల్, ఫౌండేషన్ సభ్యులు యర్రమల సత్యనారాయణ, మారేశ్వరావు, పొదిల రాయప్ప, గడిదేసి యేసు, మద్దిపాటి ఉదయ్, హర్షకుమార్, చవ్వా శ్రీనివాసరావు, నాయుడు, మహేష్, గుండా శ్రీనాథ్, కొప్పెర్ల నాగరాజు, ఏసుపాదం, పండు, టోకురి ఏబు, ఫౌండేషన్ సభ్యులు, ఎస్‌సి సెల్ నాయకులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని బలివే గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పటుకున్నారు. బలివే గ్రామంలోని దాసి సుమన్ అతనికి చెందిన తోటలోని షెడ్డు వద్ద 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచాడు. సమాచారం తెలుసుకున్న విజిలెన్స్ అధికారులు బుధవారం దాడి చేసి ఆ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారని డిటి వెంకటేశ్వరరావు తెలిపారు.

కుమార్తె కనిపించడంలేదని తల్లి ఫిర్యాదు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కుమార్తె కనిపించడంలేదని తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎఎస్‌ఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని దాట్లవారిగూడెం గ్రామానికి చెందిన కారం రాజమ్మకు ఇద్దరు కుమార్తెలు. వారిలో చిన్న కుమార్తె కారం హర్షిత ఈ నెల ఏడో తేదీ సాయంత్రం గ్రామంలోని బంధువు ఇంటికి వెళ్లివస్తానని తల్లితో చెప్పి వెళ్లింది. మళ్లీ తిరిగి రాకపోవడంతో బుధవారం హర్షిత తల్లి రాజమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలీని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు రైల్వే స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకున్న రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యారు. ఏలూరు రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రైలు నుంచి జారిపడి ఉంటాడని తెలిపారు. తీవ్ర గాయాలపాలైన అతడిని ఏలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరులోని జిల్లా కారాగారం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా జైల్ సూపరింటెండెంట్ సిహెచ్ఆర్‌వి.స్వామి మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల సంక్షేమం, అభివృద్ధి గురించి అనేక కార్యక్రమాలు అమలు పరుస్తున్నామని చెప్పారు. మహిళా ఖైదీల కోసం వృత్తి పరమైన శిక్షణ ఇస్తున్నామని వాటిని ఉపయోగించుకోవాలని కోరారు. అనంతరం ప్రముఖ హోమియో వైద్య నిపుణురాలు డాక్టర్ అబ్బూరి అరుణను సత్కరించారు. పోణంగి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలను ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు.

చాట్రాయి : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని మండల సమైక్య కార్యాలయంలో బుధవారం మహిళలను సన్మానించినట్లు ఎపిఎం టి.శేఖర్ తెలిపారు. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

మండలంలోని పోతనపల్లి గ్రామంలో పర్వతనేని గంగాధర్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. బుధవారం గిరిజన మహిళలు వందలాది మందికి పర్వతనేని గంగాధర్ పసుపు కుంకుమ, చీర ఇచ్చి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు.

దెందులూరు : దెందులూరు మండల ప్రాథమిక పాఠశాల-1లో యుటిఎఫ్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ దెందులూరు మండల అధ్యక్షులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

భీమడోలు : భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ వై.రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పొలసానిపల్లి గ్రామం ద్వారా స్థానిక యూనియన్ బ్యాంకు శాఖ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తున్న సర్పంచి షేక్ రహీమా బేగం హసేనను యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ శ్రీధర్, సహాయ మేనేజర్ కమల సర్పంచి నివాసంలో సత్కరించారు. మానవతా భీమడోలు శాఖ, భీమడోలు డైమండ్ లయన్స్ క్లబ్ వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో వివిధ రంగాల్లో ప్రతిభ కనపరిచిన మహిళలను సత్కరించారు. కార్యక్రమానికి భీమడోలు సిఐ వి.వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ రాఘవన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : స్థానిక ఎంపిపి స్కూల్లో బి.మరియమ్మ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిలా ఉపాధ్యక్షులు శుక్ల బోయిన రాంబాబు మాట్లాడారు. సదస్సులో మిడేమీల్ వర్కర్స్ ఎలికే అంజలీదేవి, సిహెచ్.విజయ, కాంతమ్మ, చెబత్తుల అనసూయ పాల్గొన్నారు.

కుక్కునూరు : సుందరయ్య భవనం ప్రజా సంఘాలు కార్యాలయంలో సిఐటియు ఆధ్వర్యంలో బాడిస సుజాత అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. సిఐటియు మండల అధ్యక్షులు కుంజ నాగలక్ష్మి మాట్లాడారు. ఈ సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి యర్ణం సాయికిరణ్, మండల ఉపాధ్యక్షులు షేక్ వలిపాషా, కమిటీ సభ్యులు రమాదేవి, సుజాత, అన్నపూర్ణ, పార్వతి, సౌజన్య, వెంకటలక్ష్మి, నాగలక్ష్మి, మాధవి

చింతలపూడి : పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ కళాశాల మహిళ హాస్టల్‌లో మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పి.డేవిడ్‌రాజు, కుమారి, ఉమర్ ఫారుక్, అక్బర్ అలీ పాల్గొన్నారు. స్థానిక మెరకవీధిలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఐద్వా, యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో ఐద్వా నాయకులు ఎం.వరలక్ష్మి అధ్యక్షతన మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడారు. అనంతరం తమ తమ రంగాల్లో విశేష సేవలందించిన అంగన్‌వాడీ వర్కర్లు ముగ్గురిని, వైద్య ఆరోగ్య శాఖ ఆశా వర్కర్లు ఇద్దరిని సత్కరించారు.

ముసునూరు : మండలంలోని ముసునూరు ప్రేరణాలయంలో మహిళ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని భారతి విద్యానికేతన్ పాఠశాల, శ్రీశాంతినికేతన్ పాఠశాల, పలు పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు, డ్యాన్సులతో అలరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, ఎంపిపి కృష్ణకుమారి, సుబ్బారావు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, ప్రేరణాలయ సిస్టర్లు పాల్గొన్నారు.



ఆగిరిపల్లిలో...

ఆగిరిపల్లి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఎంఇఒ పి.రత్నకుమార్ మాట్లాడారు. గ్రామ సర్పంచి లక్ష్మీవిక్టర్‌బాబు, మహిళాఉపాధ్యాయులు టి.పార్వతి, బి.మేరీసరోజిని, ఎస్‌కె.సాజిదాబేగం, వై.లక్ష్మి, పి.ఉమామహేశ్వరీలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.కృష్ణ, ఎం.జోగిరాజు, గౌరవ అధ్యక్షులు ఎం.ప్రభావతి, కోశాధికారి రామచంద్రన్, జిల్లా కార్యదర్శి బి.అనూరాధ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : మండల వ్యాప్తంగా అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక పశు వైద్య శాలలో పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సాయి బుచ్చారావు అధ్వర్యంలో మండలంలో పనిచేస్తున్న పశు వైద్య సిబ్బందిని శాలువాలతో సత్కరించారు. అనంతరం వారికి దాతలు కీర్తిశేషులు పిన్నమరాజు వరప్రసాద్ జ్ఞాపకార్థం పెనుమత్స వంశీరాజు, జంపన కృష్ణంరాజు వార్ల జ్ఞాపిక లను అందించారు. స్థానిక మహిళ సమాఖ్య కార్యాల యంలో ఎంపిడిఒ మంగ తాయారును, మహిళ సిబ్బందిని శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందించారు.



జంగారెడ్డిగూడెంలో..

మండల కేంద్రంలో ఐద్వా ఆధ్వర్యంలో మహిళ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి హైమవతి మాట్లాడుతూ చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి నేలటూరి నిర్మల, తెల్లం దుర్గారావు, కొండలరావు, రాజమ్మ పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : మండల సమాఖ్య అధ్వర్యంలో అదనపు పథక సంచాలకులు ఎం.నాగేశ్వరరావు, ఎపిఎం పద్మావతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురిని సత్కరించారు. ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ ఎపిడి నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ మహిళలు డ్వాక్రా సంఘాల ద్వారా బ్యాంకుల ద్వారా రుణాలు పొంది వాటి ద్వారా అభివృద్ధి చెందాలని కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ పియువిఎన్.మణింద్రరావు, వైస్ ప్రిన్సిపల్, ఆంగ్ల ఉపన్యాసకులు మర్రి వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో కళాశాల మహిళా సాధికారికత విభాగం కో-ఆర్డినేటర్, చరిత్ర ఉపన్యాసకురాలు డాక్టర్ పరిమి శ్రీలక్ష్మి అధ్యక్షతన మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారిత విభాగం సభ్యురాలు మరుము భాగ్యలక్ష్మి, అధ్యాపకులు శ్రీను, రవి విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదివాసి విజ్ఞాన కేంద్రంలో శ్రామిక మహిళ కన్వీనింగ్ కమిటీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. శ్రామిక మహిళా కన్వీనర్ మొడియం నాగమణి మాట్లాడుతూ ఆధునిక మహిళ చరిత్ర తిరగరాస్తుందని గురజాడ చెప్పినట్లు నేడు అన్ని రంగాల్లో మహిళలు ప్రధాన పాత్ర పోషిస్తున్నారన్నారు. బిజెపి ప్రభుత్వం మహిళలను మళ్లీ తిరిగి వెనకటి కాలానికి తీసుకెళ్లాలని చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు తామ ముత్యాలమ్మ, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, లక్ష్మి, రాధ, సుధ, కొవ్వాసు లక్ష్మి, కనక, మణి, కుమారి పాల్గొన్నారు.

పోలవరం : మండలంలో పలుచోట్ల మహిళలకు సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. పోలవరం మండల కేంద్రంలో స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో మదర్‌థెరిసా సేవా సంఘం ఆధ్వర్యంలో సున్నం సుధీర్‌రాజు, పఠాన్ ఖాజా, మానవతాధీర అవార్డు గ్రహీత షేక్ సహీన్నా బాషా, పోలవరం పారిశుధ్య కార్మికురాలు మాడుగుల పెద్దింట్లుకు శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను, ప్రధానోపాధ్యాయులు బొబ్బిలి స్వరూప్‌ను మహిళా దినోత్సవం సందర్భంగా శాలువాలు కప్పి సత్కరించారు. నూతనగూడెంలో 109 సంవత్సరాలు వయసు కలిగిన శతాధిక వృద్ధురాలు జల్లేపల్లి అచ్చయ్యమ్మకు సన్మానం చేశారు. ఎల్ఎన్‌డి పేట ఉపాధి మహిళా కూలీలకు ఉపాధి మేటు పోసి బాబు సన్మానం చేశారు.

ఉంగుటూరు : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉంగుటూరు తహశీల్దారు కార్యాలయంలో మహిళా ఉద్యోగులకు సన్మానం, కేకు కటింగ్ నిర్వహించారు. ముగ్గురు మహిళా విఆర్‌ఒలు, ఇద్దరు కార్యాలయ సిబ్బందితో కేక్ కోయించారు. వారికి శాలువ కప్పి సన్మానించి నూతన వస్త్రాలు అందించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉంటున్నారని తహశీల్దార్ ఎవి.రమణాంవు అన్నారు. ఎన్నికల డిటి ఎన్.కిరణ్మయికి జిల్లాస్థాయిలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిటి పోతురాజు, ఆర్ఐ సత్యనారాయణ, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ సాయిరమేష్, విఆర్‌ఒలు సిబ్బంది పాల్గొన్నారు. చేబ్రోలు పంచాయతీ కార్యాలయంలో సర్పంచి లక్ష్మీసునీత ఆధ్వర్యంలో పలువురు మహిళలను సత్కరించారు. పంచాయతీ కార్యదర్శి బివి.రవిచంద్రకుమార్ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : వికాస్ విద్యాసంస్థల ప్రాంగణంలో మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి, వైస్ ఛైర్మన్ కంచర్ల వాసవి రత్నంలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వికాస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ గుమ్మడి సౌజన్యలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వికాస్ విద్యాసంస్థల డైరెక్టర్ ఊరకరణం జగన్, డీన్ కె.సత్యనారయణ, ఎన్.మోహన్, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

కైకలూరు : స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో ఎంఎల్‌ఎ సతీమణి దూలం వీరకుమరి మాట్లాడారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దండే పుష్పలత ఆధ్వర్యంలో పలువురిని సత్కరించారు. ఎంఎల్‌ఎ సతీమణి వీరకుమారి, ఎంపిటిసి సభ్యులు బోడిచర్ల స్వాతి, 13వ వార్డు సభ్యులు గుడిపాటి విజయశేషు, అనితలను సన్మానించారు.

స్థానిక వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో వార్డు ఆరుగురు గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో మహిళా దిత్సవ వేడుక ఘనంగ నిర్వహించారు. జమఅతే ఇస్లామి హింద్ -మహిళా విభాగం తరపున చైతన్య సదస్సును సత్తిపండు కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఏలూరు టౌన్ : ఏలూరు చేపల తూము సెంటర్లో శ్రామిక మహిళలతో సభ నిర్వహించారు. మహాలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సభలో ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు ఎన్.అమ్మాజీ మాట్లాడారు. ఈ సభలో పిఒడబ్ల్యూ నాయకురాలు లక్ష్మి, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళలు మహాలక్ష్మి, సీత, జగదీశ్వరి, సోమమ్మ, దేవి, కుమారి, పద్మ, శ్యామల, సరిత, గౌరి, సుహాసిని, అంజలి, చంటి, శ్రీను, అప్పలరాజు పాల్గొన్నారు.

వేలేరుపాడు : మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సిపిఐ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిపిఐ కార్యాలయంలో సోడె భద్రకేళి, పిట్టా జయ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో మహిళా సమాఖ్య మండల కార్యదర్శి సోడె రమాదేవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి బాడిస రాము, గిరిజన సమైక్య జిల్లా కార్యదర్శి దారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, మండల కౌన్సిల్ సభ్యులు సోడె సత్తిబాబు, మహిళా సమాఖ్య కార్యవర్గ సభ్యులు చిన్నమ్మి పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినప్పుడే ప్రగతిశీల సమాజాన్ని నిర్మించగలమని కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఆగిరిపల్లి బ్రాంచి మేనేజర్ కె.మరియమ్మ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం ఆగిరిపల్లి కెడిసిసి బ్యాంకులో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి సూపర్‌వైజర్ యు.శ్రీధర్, ఆగిరిపల్లి, ఈదర, కృష్ణవరం పిఎసిఎస్ కార్యదర్శులు ఎం.రంగారావు, ఆర్.సూర్యప్రకాష్‌రావు, బి.మధు, డ్వాక్రా గ్రూపు మహిళలు పాల్గొన్నారు.

నూజివీడు : పేద, మధ్య తరగతి మహిళలు రాజ్యాధికారం దిశగా రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటున్నారంటే అది టిడిపి వల్లే సాధ్యమైందని కృష్ణా జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ గద్దె అనురాధ అన్నారు. టిడిపి నూజివీడు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం గద్దె అనురాధ నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు యనమదల ఉషారాణి, ఏలూరు పార్లమెంట్ తెలుగు మహిళా నాయకురాలు గొల్లు దుర్గాదేవి, డ్వాక్రా మహిళా సాధికార కమిటీ సభ్యులు కౌన్సిలర్ కొమ్మని విజయ, కౌన్సిలర్ తిరుమలశెట్టి సాధన లక్ష్మీ స్రవంతి, డ్వాక్రా మహిళా కమిటీ సభ్యురాలు షేక్ నజీమా, పట్టణ తెలుగు మహిళలు శీలం పద్మా, రాధాకుమారి, జొన్నలగడ్డ శివలక్ష్మి, రిమ్మనపూడి నాగమణి, జాలాది సుధారాణి, వేమూరి లక్ష్మీగౌరిశ్రీ శాలువాతో ఘనంగా సత్కరించారు.

ముదినేపల్లి : దేశాభివృద్ధిలో మహిళలే కీలకమని ముదినేపల్లిలోని ఎ లిటిల్ ఫ్లవర్ ది లీడర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ బొర్రా చలమయ్య అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా బుధవారం స్కూల్‌లో వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో స్థిరపడిన మహిళలను ఘనంగా సన్మానించారు.

బాధిత మహిళకు సర్పంచి దంపతుల చేయూత

ప్రజాశక్తి - భీమడోలు

జీవన్మరణ సమస్యను ఎదుర్కొంటున్న మహిళను ఆదుకునేందుకు పొలసానిపల్లి గ్రామ సర్పంచి దంపతులు షేక్ రహీమా బేగం, షేక్ హసేన ముందుకు వచ్చారు. ఈ మేరకు వారు బుధవారం బాధిత కుటుంబం ఇంటికి వెళ్లి వారిని పరామర్శించారు. వైద్యం కోసం ఆర్థిక సాయం అందించారు. ఈ క్రమంలో బాధితురాలు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ సదరు కుటుంబానికి నూతన వస్త్రాలను అందించారు. గ్రామ పరిధిలోని 12వ వార్డుకు చెందిన సంగెం మరియమ్మకు రెండు కిడ్నీలు పాడయ్యాయి. దీంతో ఆమెకు అరుదైన డయాలసిస్ ఫిస్టులా వ్యాధి సోకింది. చికిత్సలో భాగంగా వారంలో మూడు రోజుల పాటు డయాలసిస్ అందించాల్సి ఉంది. ప్రభుత్వ వైద్యశాలలో డయాలసిస్ మెడ ద్వారా అందించటం వల్ల రోగి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకునేందుకు వారి ఆర్థిక పరిస్థితి సహకరించే పరిస్థితి లేదు. ఈ దశలో బాధిత మహిళ కుటుంబీకులు పొలసానిపల్లి సర్పంచి దంపతులను సంప్రదించారు. దీనిపై స్పందించిన సర్పంచి దంపతులు విజయవాడలోని ప్రయివేట్ వైద్యశాల వారిని సంప్రదిం చారు. వారితో జరిపిన చర్చలు సఫలీకృతం కావడంతో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా డయాలసిస్ ఫిస్టులా ఆపరేషన్ చేసేందుకు వైద్యశాల వారు సంసిద్ధత వెలిబుచ్చారు కాని ఆపరేషన్‌కు ముందు ముందస్తు చికిత్స, స్కానింగ్ ఇతర రూపాల్లో చికిత్స కోసం అవసరమైన మొత్తాలను సమకూర్చుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన సర్పంచి దంపతులు సదరు కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక, ఇతర సహాయాలను బుధవారం వారికి అందించారు. బాధిత మహిళ ఆపరేషన్ పూర్తయ్యి ఆరోగ్యవంతులుగా తిరిగి ఇంటికి వచ్చేంతవరకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. బాధిత మహిళ ఇద్దరు పిల్లలకు అదనపు పౌష్టికాహారం ఇతర రూపాలలో సహకారం కోసం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సంప్రదించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి సభ్యులు ఎ.దేవీనాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు. గ్రామంలో బుధవారం నిర్వహించిన మరొక కార్యక్రమంలో నాలుగో వార్డులో గృహ నిర్మాణ సంస్థ ద్వారా గృహ నిర్మాణం ప్రారంభించిన యూనిట్‌కు సర్పంచి దంపతులు శంకుస్థాపన చేశారు.

మాలమహానాడు జిల్లా అధ్యక్షునిగా రవీంద్ర

ప్రజాశక్తి - ముదినేపల్లి

మాలమహానాడు జిల్లా అధ్యక్షులుగా భూపతి రవీంద్రను మాలమాహానాడు జాతీయ అధ్యక్షులు సాదే డేవిడ్‌రాజు బుధవారం ప్రకటించారు. జిల్లా, కైకలూరు నియోజకవర్గ నూతన కమీటిలను ముదినేపల్లిలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ప్రకటించారు. జిల్లా అధ్యక్షులుగా రవీంద్ర, ప్రధాన కార్యదర్శిగా పంతగాని సురేష్, మత్తే శివ, జాయింట్ సెక్రటరీగా గరికముక్కు చార్లేస్‌ని నియమించారు. కైకలూరు నియోజకవర్గ మాలమహానాడు అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా గండేపూడి రవిశంకర్, కార్యదర్శిగా నేరేళ్ల తంబి, కోశాధికారిగా సింగవరపు చందులను నియమించారు. ముదినేపల్లి మండల అధ్యక్షునిగా పాగోలు విజయసాగర్, సభ్యులుగా దుబా విజయ్‌కుమార్, సోమల విజయశేఖర్‌లను ప్రకటించారు.

మహిళలు మానసిక దృఢత్వం పెంపొందించుకోవాలి

ప్రముఖ సైకాలజిస్ట్ ఎం.రోజారాణి

ప్రజాశక్తి - నూజివీడు

మహిళలు మానసిక దఢత్వంతో ఉన్నప్పుడే అనుకున్నది సాధించడానికి ఆత్మ ధైర్యం పెరుగుతుందని, తద్వారా సమాజంలో ఎదురయ్యే అనేక సమస్యలను ఛేదించగలరని, దీంతో సమాజాభివృద్ధికి దోహదపడగలరని స్థానిక నూజివీడుకు చెందిన ఆదరణ కౌన్సెలింగ్ సెంటర్ కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ డాక్టర్ ఎం.రోజారాణి అన్నారు. కౌన్సిలింగ్ సెంటర్లో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ లింగ సమానత్వం అనేది అందరి సమిష్టి కృషితోనే సాధ్యపడుతుందన్నారు. తల్లిదండ్రులు పిల్లల పెంపకంలో లింగ భేదం చూపకుండా అన్ని విషయాల్లో సమానంగా ఆదరించాలన్నారు. అందుకు ముందుగా కుటుంబాల్లోనే ఈ మార్పు ప్రారంభం కావాలన్నారు. సమాజంలోని మహిళలకు ప్రాధాన్యతనిస్తూ వారి ఆశలకు ఆశయాలకు, కట్టుబాట్లు సాంప్రదాయాల పేరుతో అడ్డు చెప్పకుండా వారికి సహాయపడుతూ ప్రోత్సహించాలన్నారు. అప్పుడే మహిళలు అన్ని రంగాల్లో నైపుణ్యత సాధించగలరని ఆమె అన్నారు. ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా సమాజం ఈక్విటీని ఎంబ్రెస్ చేయండి అనే థీమ్‌ను ఎంచుకుందన్నారు. లింగ సమాన ప్రపంచాన్ని రూపొందించడంలో సహాయపడటానికి అనేక కార్యక్రమాలను చేపట్టాలని పిలుపునిచ్చింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం మహిళలు విజయాలను జరుపుకునే దినోత్సవానికే పరిమితం కాకుండా మహిళా సమానత్వాన్ని వేగవంతం చేయడానికి క్రియాశీల వేదిక కావాలని డాక్టర్ రోజారాణి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆమె ప్రపంచ ప్రఖ్యాత ఫెమినిస్ట్, జర్నలిస్ట్ గ్లోరియా స్టైనెమ్ మాటల్లో... సమానత్వం కోసం మహిళల పోరాటం ఏ ఒక్క స్త్రీ వాదికి లేదా ఏ ఒక్క సంస్థకు చెందినది కాదు, మానవ హక్కుల గురించి పట్టించుకునే వారందరి సమిష్టి కృషికి సంబంధించినది. అందువల్లే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని లింగ భేదాభిప్రాయాలు లేకుండా అందరూ మీ రోజుగా చేసుకోండి.. మహిళలకు నిజంగా సానుకూల మార్పు తీసుకురావడానికి మీరు చేయగలిగినంత చేయండని ప్రఖ్యాత గ్లోరియా మాటలను ఆమె గుర్తు చేశారు.



రోజారాణి